క్లుప్తంగా

రైతులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏఈవో తాండవ కృష్ణ

వాంకిడి: పత్తి విత్తనాల కొనుగోలు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ అధికారులు గురువారం రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని శివకేశవ్‌నగర్, అర్జుగూడ, నార్లపూర్, జైత్పూర్ గ్రామాల్లో క్లస్టర్ల వారీగా రైతులతో సమావేశం నిర్వహించారు. లూజుగా అమ్మే విత్తనాలు కొనుగోలు చేయవద్దని, గుర్తింపు పొందిన డీలర్ల వద్ద మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. విత్తన ప్యాకెట్లు బిల్లులు పంట కాలం పూర్తయ్యే వరకు ఉంచుకోవాలన్నారు. కార్యక్రమాల్లో ఏఈవోలు రాజేశ్వర్, మానస, శంకర్, తాండవ కృష్ణ పాల్గొన్నారు.

నేడు 'బడిబాట' సమావేశం

కెరమెరి: జూన్ 3 నుంచి ప్రారంభం కానున్న బడిబాటలో భాగంగా నేడు మధ్యాహ్నం 3 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో అంజద్ పాషా ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎంపీడీవో, తహసీల్దార్, ఎంఈవో, ఎంఎస్‌వో, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం, హెచ్‌డబ్ల్యూవో, ఎస్సీఆర్‌పీలు, సీఆర్‌పీలు, ఐకేపీ ఏపీఎం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, వీవో సభ్యులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

లింగాపూర్: మండల కేంద్రంలోని నేడు మధ్యాహ్నం 3 గంటలకు లింగాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో బడిబాట సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రామేశ్వర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రధానోపాధ్యాయులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఎమ్మార్పీకే విత్తనాలు విక్రయించాలి



రిజిస్టర్ పరిశీలిస్తున్న ఏఈవో రవితేజ

బెజ్జూర్: ఎమ్మార్పీ ధరలకే రైతులకు విత్తనాలు విక్రయించాలని ఏఈవో రవితేజ అన్నారు. గురువారం మండలంలోని విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. డీలర్లు రైతులకు సరైన వివరాలతో కూడిన బిల్లు ఇవ్వాలని సూచించారు. విత్తన విక్రయాలకు సంబంధించి రిజిస్టర్‌లో రైతుల వివరాలు నమోదు చేయాలన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

దహెగాం: పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని డీఎల్‌పీవో సురేశ్‌బాబు అన్నారు. మండలంలోని కొత్మీర్, బీబ్రా గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. నర్సరీలు, ప్రకృతి వనాలు, సెగ్రిగేషన్ షెడ్లు, డంపింగ్‌యార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీల్లోని మొక్కలు ఎండిపోకుండా ప్రత్యేక శ్రద్ధ ఉంచాలన్నారు. వర్షాకాలంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటేందుకు మొక్కలు సిద్ధం చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. తడిచెత్త నుంచి వర్మీ కంపోస్టు ఎరువులు తయారు చేయాలని ఆదేశించారు.

నేడు మండల సమాఖ్య సమావేశం

కెరమెరి: మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు మండల సమాఖ్య సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ఐకేపీ ఏపీఎం జగదీశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సీసీలు, వీవోఏలతో పాటు మండల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

మెస్రం లక్ష్మణ్‌కు నివాళి

జైనూర్: గుండెపోటుతో మృతి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు మెస్రం లక్ష్మణ్‌కు గురువారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు నివాళులర్పించారు. గురువారం జైనూర్‌లోని ఆయన నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అంత్యక్రియలకు హాజరయ్యారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కోట్నక విజయ్, కాంగ్రెస్ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

వేగంగా కుట్టేస్తున్నారు!

- 1363 యూనిఫాంలు రెడీ
- పూర్తి కావడానికి మరో ఆరురోజుల గడువు
- వీవో మహిళలకు చేతినిండా పని
- ఆర్థికాభివృద్ధి దిశగా మహిళలు



కెరమెరిలో యూనిఫాంలు కుడుతున్న మహిళలు

కెరమెరి: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు యూనిఫాం కుట్టేందుకు ఈసారి ప్రభుత్వం మహిళా సంఘాల సభ్యులకు అప్పగించింది. గతంలో ఇదే పనిని గుత్తేదారులకు ఇచ్చేవారు. వారు దుస్తులను పాఠశాలలు తెరిచే నాటికి ఇచ్చే వారు కాదు. దీంతో కొందరు విద్యార్థులకు మాత్రమే ఏకరూప దుస్తులు అందేవి. మరికొందరికి నెలల తరబడి ఇస్తూనే ఉండేవారు. ఇటీవల ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధి గురించి ఆలోచించి దుస్తులు కుట్టే పనిని మహిళాసంఘాలకు అప్పగించింది. దీంతో మండల సమాఖ్య ఆధ్వర్యంలో వీవోల ఉన్న గ్రామైఖ్య సంఘాల సభ్యులు విద్యార్థుల దుస్తులు కుట్టిస్తున్నారు. వచ్చే నెల ఆరులోపు పాఠశాలలకు అందేలా వీవోలు ప్రణాళికలు రూపొందించారు.

83 పాఠశాలలు 2808 విద్యార్థులు..

మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో 83 పాఠశాలలకు చెందిన 2808 విద్యార్థులకు ఒక జత యూనిఫాం కుడుతున్నారు. ఒక జతకు వాస్తవంగా రూ. 50 చెల్లించాల్సి ఉండగా.. కలెక్టర్ చొరవతో మరో రూ.25 పెంచేసి రూ.75 కుట్టు కూలి ఇస్తున్నారు. విద్యార్థులకు సరిపడ దుస్తులు కుట్టేందుకు పది క్లస్టర్లను ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లోని మహిళా సంఘాల్లో ఉన్న మహిళలకు యూనిఫాం కుట్టే బాధ్యత అప్పగించడంతో వేగంగా కుట్టేస్తున్నారు. గురువారం నాటికి 1363 యూనిఫాం కుట్టారు. జూన్ 6 వరకు దుస్తులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేయాలని ఆదేశాలున్నాయి. దీంతో మహిళలు రాత్రి, పగలు తేడా లేకుండా బట్టలు కుట్టే పనిలో నిమగ్నమయ్యారు.

అధికారులు పర్యవేక్షణ

మండల సమాఖ్యలో విధులు నిర్వహిస్తున్న ఏపీఎంతో పాటు సీసీలు ప్రతీ రోజు ఆయా కేంద్రాలకు వెళ్లి దుస్తుల కుట్టడాన్ని పర్యవేక్షిస్తున్నారు. ఏరోజుకు ఆరోజు ఉన్నతాధికారులకు ఎన్ని జతలు కుట్టడం పూర్తి అయిందో సమాచారం అందిస్తున్నారు. ఇప్పటికే కలెక్టర్ వెంకటేశ్ దోత్రేతో పాటు అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారి, డీఈవో అశోక్ కుట్టు కేంద్రాలను సందర్శించి తగు సూచనలు చేసి, పని వేగవంతం చేయాలని ఆదేశించారు.

ఆర్థికంగా అభివృద్ధి



విద్యార్థుల దుస్తుల కుట్టే పనిని అప్పగించడం వల్ల ఎంతో కొంత ఆర్థికంగా అభివృద్ధి సాధించే అవకాశం ఉంది. ప్రతీసారి ఇదే విధంగా మహిళలకు పనులు అప్పగిస్తే బాగుంటుంది. కుట్టు శిక్షణ పూర్తి చేసి ఎలాంటి పనులు లేకుండా ఖాళీగా ఉంటున్న వారికి ఇదో చక్కని అవకాశం.

– సుహాన పర్వీన్, సుల్తాన్‌గూడ

గడువు లోపు అందిస్తాం



అధికారులు తెలిపిన గడువులోపు విద్యార్థుల యూనిఫాం అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. సీసీలు ఎప్పటికప్పుడు ఆయా కుట్టు కేంద్రాలను పరిశీలిస్తున్నారు. కుట్టు పని వేగంగా కొనసాగుతోంది. మహిళా సంఘాలకు ఇదో చక్కని అవకాశం.

– జగదీశ్వర్, ఏపీఎం కెరమెరి

అర్ధరాత్రి హైడ్రామా..!



కౌటాల పోలీస్‌స్టేషన్

- యువకుడిని అదుపులోకి తీసుకున్న చింతలమానెపల్లి ఎస్సై
- పోలీస్‌స్టేషన్ల ఎదుట కుటుంబసభ్యుల ఆందోళన

కౌటాల: జిల్లాలోని కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్ పోలీస్‌స్టేషన్ల ఎదుట బుధవారం అర్ధరాత్రి హైడ్రామా చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. జిల్లాలోని బెజ్జూర్ మండలం కుంటలమానెపల్లి గ్రామానికి చెందిన కొందరు బుధవారం అర్ధరాత్రి కౌటాల పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. కుంటలమానెపల్లి గ్రామానికి చెందిన పేదం నరేశ్ అనే వ్యక్తిని చింతలమానెపల్లి ఎస్సై నరేశ్ పోలీస్ సిబ్బందితో సివిల్ డ్రెస్‌లో వచ్చి బుధవారం రాత్రి కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వకుండా వాహనంలో ఎక్కించుకొని వెళ్లారు. దీంతో కుటుంబసభ్యులు, బంధువులు బెజ్జూర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి నరేశ్ ఆచూకిపై ఆరా తీశారు. అక్కడి సిబ్బంది తమకు తెలియదని చెప్పాడంతో అనంతరం అక్కడ నుంచి వెళ్లి చింతలమానెపల్లి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. నరేశ్‌ను ఎందుకు తీసుకెళ్లారని ప్రశ్నించగా.. పోలీసుల నుంచి సరైన సమాధానం రాలేదు. రాత్రి 1 గంట ప్రాంతంలో కౌటాల సర్కిల్ కార్యాలయానికి వచ్చి పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. ఆందోళన విషయం తెలుసుకున్న కౌటాల ఎస్సై మధుకర్ ఈ విషయాన్ని పోలీస్ ఉన్నతాధికారుల తెలియజేశారు. ఉన్నతాధికారులు ఆరా తీయగా అప్పటికే నరేశ్‌ను చింతలమానెపల్లి ఎస్సై వాహనంలో కరీంనగర్ వరకు తీసుకెళ్లినట్లు తెలిసింది. గురువారం ఉదయం 5 గంటల ప్రాంతంలో నరేశ్‌ను పోలీసు సిబ్బందితో పంపించి ఇంటి వద్ద వదిలేశారు. దీంతో వివాదం సద్దుమనిగింది. ఇటీవల దిందా గ్రామంలో నకిలీ పత్తి విత్తనాలు పట్టుబడగా కుంటలమానెపల్లికి చెందిన శివుడు పేరు బయటికి వచ్చింది. ఆయన దగ్గర పని చేసిన పేదం నరేశ్‌ను విచారణ నిమిత్తం పోలీసులు సివిల్ డ్రెస్‌లో వచ్చి అర్ధరాత్రి తీసుకెళ్లినట్లు సమాచారం. నకిలీ పత్తి విత్తనాల విషయంలో తమ కొడుకుకి ఎలాంటి ప్రమేయం లేకపోయినా.. పోలీసులు కావాలనే ఇబ్బందులకు గురిచేస్తున్నారని కుటుంబసభ్యులు ఆరోపించారు. అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని శ్రీసాయి ఆస్పత్రి గైనకాలజిస్టుగా విధులు నిర్వర్తిస్తున్న వైద్యురాలు పోలుమూరి నవ్యశ్రీ తనకు నమ్మకద్రోహం, అన్యాయం చేసిందని సంజన్ లైఫ్‌లైన్ ఆస్పత్రి యాజమాన్య నిర్వాహకులు గిద్దమర్రి శ్రీనివాస్ యాదవ్, వనిత దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టణంలోని పెట్రోల్‌పంపు ఏరియాలో సంజన లైఫ్‌లైన్ ఆస్పత్రి పేరుతో ఆస్పత్రిని నడిపినట్లు తెలి పారు. ఆ సమయంలో ఆస్పత్రిలో గైనకాలజిస్టుగా విధులు నిర్వర్తించిన నవ్యశ్రీకి కొత్తగా ఏర్పాటు చేసిన శ్రీసాయి ఆస్పత్రి నిర్వహణ బాధ్యతను అత్యంత నమ్మకంతో అప్పగించినట్లు తెలిపారు. వైద్యురా లు నవ్యశ్రీ, ఆస్పత్రిలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న రాహుల్ అలియాస్ రహీంలు కుమ్మక్కై తనకు తెలియకుండా వేరే భవనంలోకి ఆస్పత్రిని మారుస్తున్నట్లు తనకు సమాచారం రావడంతో అడ్డుకున్న తనపై ఈనెల 24న దాడిచేసి గాయపర్చినట్లు తెలిపారు. వైద్యురాలు నవ్యశ్రీ ఖమ్మం జిల్లా మణుగూరు పట్టణానికి చెందిందని, తమది బెల్లంపల్లి పట్టణమని, ప్రస్తుతం కర్ణాటకలో భార్య వనిత అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా ఉద్యోగం చేస్తున్నట్లు తెలిపారు. జీతాలు, మెయింటెనెన్స్ అన్ని ఖర్చులు కూడా వైద్యురాలు నవ్యశ్రీ అకౌంట్లో జమ చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హెల్త్ కమీషనర్, కలెక్టర్, డీఎంఅండ్‌హెచ్‌వోలకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అధికారులు స్పందించి వైద్యురాలిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు.

ఎలక్ట్రిక్ వాహనాలపై ఆసక్తి



- భారీగా పెరిగిన అమ్మకాలు
- తక్కువ ఖర్చుతో ఎక్కువ దూరం ప్రయాణం

బోథ్: మార్కెట్లో ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ప్రస్తుతం మార్కెట్‌లో ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. తక్కువ ఖర్చుతో అధిక దూరం ప్రయాణం చేసే అవకాశం ఉండడంతో ప్రజలు వాటి వైపు మొగ్గు చూపుతున్నారు. పెట్రోల్, డీజిల్ అంటూ బంకుల ఎదుట పడిగాపులు కాసే రోజుల నుంచి విముక్తి పొందేలా ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. ద్విచక్ర వాహనాలతో పాటు మూడుచక్రాలు, నాలుగు చక్రాల వాహనాలు మార్కెట్లో అందుబాటులోకి వచ్చాయి. ఇంట్లో డీజిల్, పెట్రోల్ వాహనాలు అందుబాటులో ఉన్నప్పటికీ ఒక ఎలక్ట్రిక్ వాహనం కూడా అందుబాటులో ఉంచుకోవాలని ప్రజలు ఆలోచిస్తున్నారు. బ్యాటరీ రీచార్జితో 100 నుంచి 400 కిలోమీటర్లు ప్రయాణించే అవకాశం ఉండడంతో వాహనాదారుల ఎలక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేసేందుకు ముందుకు వస్తున్నారు. వారి అవసరాలకు అనుగుణంగా కంపెనీలు సైతం వాహనాలను అందుబాటులోకి తెస్తున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో టీజీ ఆర్టీసీ కూడా ఎలక్ట్రిక్ బస్సులను నడిపిస్తోంది. ఇలా విద్యుత్తు వాహనాల కొనుగోలు రోజురోజుకూ ఊపందుకుంది. ప్రస్తుతం మార్కెట్లో వాహనాన్ని బట్టి రూ.60 వేల నుంచి రూ.25 లక్షల వరకు అందుబాటులో ఉన్నాయి. భవిష్యత్లో ఈ వాహనాలకు సంఖ్య మరింత పెరగనుంది.

పెరిగిన వినియోగం..

జిల్లాలో ఇప్పటికే ఎలక్ట్రిక్ బైక్‌ల సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. పల్లెల్లో కూడా ప్రస్తుతం ఎలక్ట్రికల్ బైక్‌లు దర్శనమిస్తున్నాయి. కొత్త బైక్ కొనాలనుకుంటున్న ముగ్గురిలో ఒకరు ఎలక్ట్రికల్ బైక్‌ను కొంటున్నారు. బైక్‌లే కాకుండా ఎలక్ట్రికల్ ఆటోలు, కార్ల అమ్మకాలు పెరిగాయి. అందుబాటు ధరల్లో ఉండడం, వాహనాలకు పలు ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలు లోన్ సౌకర్యం కల్పిస్తోంది. దీంతో రానున్న రోజుల్లో ఎలక్ట్రికల్ వాహనాల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉంది.


తక్కువ ఖర్చుతో..



నాది బోథ్ మండల కేంద్రం. నేను నేరడిగొండ మండలంలో గల టోల్‌ప్లాజాలో ఎలక్ట్రీషన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రతీ రోజు దాదాపు 50 కిలోమీటర్ల మేర ప్రయాణం చేయాల్సి వస్తుంది. పెట్రోల్ కోసం రూ. 120లు ఖర్చు అయ్యేది. నెలకు రూ. 3000లు పెట్రోల్‌కే ఖర్చు అయ్యేది. గత మూడు నెలల క్రితం ఎలక్ట్రిక్ బైక్ కొన్నాను. ఒకసారి రీచార్జ్ చేస్తే 150 కిలోమీటర్లు ప్రయాణిస్తోంది.

– పుట్టి నరేశ్, బోథ్

ఎంతో ఉపయోగకరం



నాది వదూర్ గ్రామం. ప్రతీ రోజు నేరడిగొండ మండల కేంద్రానికి వస్తుంటాను. పెట్రోల్ కోసం రోజూ రూ. 100 ఖర్చు అయ్యేవి. వీటితో పాటు వాహన నిర్వహణ కోసం ఖర్చు ఉండేది. రెండు నెలల క్రితం ఎలక్ట్రిక్ బైక్ కొన్నాను. ప్రస్తుతం ఎలాంటి ఖర్చు లేదు. ఎంతో ఉపయోగకరంగా ఉంది. నాతో పాటు చాలా మంది ఎలక్ట్రిక్ వాహనాలు కొన్నారు.

– ద్యావంత్ శేఖర్, వదూర్

చినుకు పడితే చీకటే..

- గంటల కొద్ది కరెంట్ కోతలు
- ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు, తీగలు
- భయాందోళనలో ప్రజలు



లింగాపూర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద విద్యు త్ తీగలకు అల్లుకొని ఉన్న చెట్లపొదలు

లింగాపూర్: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారుతోంది. చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలను పూర్తి కప్పేశాయి. వీటిని విద్యుత్‌శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో చిన్నపాటి గాలి వానకే విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోంది. గంట తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. దీంతో ప్రజలు, చిన్నారులు ఉక్కపోతకు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు రోజులు..

మండల పరిధి అంబేద్కర్ నగర్, పోచ్చమ్మనగర్, గాంధీనగర్, పిక్లాతండా, నడ్డంగుడ, మామిడిపల్లి గ్రామాలకు సరఫరా అయ్యే విద్యుత్ తీగలు చెట్ల పొదల నుంచే ఉన్నాయి. చిన్నపాటి గాలి వీచినా.. షార్ట్‌సర్క్యూట్‌తో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. మళ్లీ కరెంట్ రావాలంటే సిబ్బంది వచ్చి వైర్లు సరి చేసి పునరుద్ధరించే వరకు రోజుల స మయం పడుతోంది. ఇలా వర్షం కురిసినా.. ప్రతి సారి ఇలాగే జరుగుతుందని బాధిత గ్రామాల ప్రజ లు పేర్కొంటున్నారు. ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెట్లపొదలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్



లింగాపూర్‌లో కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్

మండలంలోని 100కు పైగా ఆయా గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెలు లేక ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్‌కు కనీస గద్దె కూడా ఏర్పాటు చేయలేదు. ప్రమాదాలు ఎప్పుడు జరుగుతాయోనని భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కంచెలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు,

వంగిన విద్యుత్ స్తంభం



రావునూర్ గ్రామశివారులోని సిర్పూర్(యూ) మండలంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ నుంచి లింగాపూర్ మండలానికి 11 కేవీ సరఫరా అయ్యే విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. గాలికి విద్యుత్ స్తంభాలు విరిగి పడితే విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. రోడ్డుకు సమీపంలో ఉండడంతో ప్రమాదం పొంచి ఉంది.

అధ్యాపకులకు పారితోషికం చెల్లించాలి

కెరమెరి: ఇంటర్ వార్షిక పరీక్షల్లో విధులు నిర్వర్తించిన అధ్యాపకులకు పారితోషకం చెల్లించాలని తెలంగాణ గజిటెడ్ లెక్చరర్ల సంఘం 475 జిల్లా అధ్యక్షుడు నవీన్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గడిచిన రెండేళ్ల పారితోషకం కూడా సరిగా అందలేదన్నారు. ఈ విషయాన్ని విద్యాశాఖ కార్యదర్శికి విన్నవించినా.. ఎలాంటి ఉపయోగం లేదన్నారు. 1లోపు రెమ్యూనరేషన్ చెల్లించని పక్షంలో 2తేదీ నుంచి పేపర్ వాల్యూవేషన్ కేంద్రాల వద్ద దశల వారీగా నిరసన కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్, ఆత్మారాం, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలి



అవగాహన కల్పిస్తున్న ఏవో రాజేశ్

కౌటాల: రైతులు నాణ్యమైన పత్తి విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలని మండల వ్యవసాయాధికారి పాలకుర్తి రాజేశ్ అన్నారు. గురువారం మండలంలోని కనికి గ్రామంలో ఉపాధిహామీ పనుల వద్ద పత్తి విత్తనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లైసెన్స్ ఉన్న ఫర్టిలైజర్ షాపుల్లోనే రైతులందరూ పత్తి విత్తనాలు కొనుగోలు చేయాలని, విత్తనాలు కొన్న షాప్ నుంచి కచ్చితంగా రశీదు తీసుకోవాలన్నారు. లూజ్ విత్తనాలు కొనుగోలు చేయవద్దన్నారు. రైతులకు జీలుగా విత్తనాలు సహకార సంఘంలో అందుబాటులో ఉన్నాయని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏ ఈవో దుర్గ భవాని, రైతులు పాల్గొన్నారు.

దోభీఘాట్ల నిర్మాణం చేపట్టాలి

తిర్యాణి: మండలంలోని దోభీఘాట్లు లేకపోవడంతో రజకులు వృత్తి చేసేకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రజక సంఘం మండల అధ్యక్షుడు బూసి సంతోశ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంతో పాటు సుంగాపూర్, గంభీరావుపేట, విజయనగరం, తలండి, భీమారం గ్రామాలల్లో దోభిఘాట్ల నిర్మాణాలకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బోథ్: మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలలో ప్రవేశాల కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేజీబీవీ కోఆర్డినేటర్ వలిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లీష్ మీడియంలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.